# నమ్మకం వెర్సెస్ సైన్స్

-గంటి భానుమతి

వైద్యం సేవా రంగం కాదు, వ్యాపారం అయింది. మరీ యింతా అని నేననుకున్నది ఢిల్లీకి తూర్పు వైపున ఉన్న నోయిడా వెళ్ళాక. నోయిడా బ్రాంచ్‌లో జాయినయిన కొన్నాళ్ళకే, ఏదో నొప్పి కడుపులో రావడం మొదలయింది. అజీర్తి అన్నారు. టైమింగ్స్. పెట్టుకున్నాను. గాస్ అన్నారు. ఎంటాసిడ్‌లు, మిల్క్ ఆఫ్ మెగ్నీషియా లాంటివి ఓ కాయితం మీద రాయడానికి మూడొందలు, మూడు గంటలు పడిగాపు. తగ్గలేదు. ఎపెండిసైటిస్ కావచ్చని, మూడుచోట్ల మూడు ఎక్స్‌రేలు తీయించాను. అదికాదు అని ఏడేసి వందలు పుచ్చుకున్నాక చెప్పారు. కొలీగ్ తివారీ, అట్టా మార్కెట్ నుంచి హోమియో మందులు తెప్పించినా ఫలితం శూన్యం. చాందినీ చౌక్ నుంచి హకీంగారి హోంమేడ్ చూర్ణాలు. నో యూజ్. ఆయుర్వేదం నిరుపయోగం అయింది. ఘరేలు-నుక్సే (యింటి చిట్కాలన్నమాట) కూడా ప్రయోజనం యివ్వలేదు.

పెపంచంలో పాపపున్నాలు లేవు. నాబ నష్టాలే ఉన్నాయి అని అనిపించారు రావిశాస్త్రిగారు రత్తాలు ద్వారా. అది అక్షరాలా నిజం. డాక్టర్ల ఫీజులు అలా ఉన్నాయి. ఈ విధంగా ఆర్నెల్ల నుంచి నొప్పి, నేనూ కలిసి ఉంటున్నాం. "కిడ్నీలోనో మరెక్కడో రాళ్ళు కూడా లేవు కాబట్టి, మనం మా ఊరి వైద్యం చేయించడానికి మహారాజ్ దగ్గరికెళ్తున్నాం" అన్నాడు తివారి.

"ఎవరా మహారాజు? ఏమా కథ?"

"మా ఊళ్ళో రామ్‌నారాయణ్ మహారాజ్ ఉన్నాడు. మహా మహా రోగాలే తగ్గించే శక్తి ఆయనకి ఉంది. మంచి సలహాలు, ఉపాయాలు యిస్తాడు. ఆయన గది ఎప్పుడూ కిటకిటలాడి పోతూంటుంది. ఈ శనివారం పొద్దున్నే మా యింటి కొచ్చేస్తే, నా కార్లో మా ఊరు వెళ్దాం. యింక నువ్వేం మాట్లాడకు."

ఉత్తరప్రదేశ్, బీహారుల్లో పల్లెటూళ్ళల్లో యింకా యిలాంటి వైద్యాలు, మీద నమ్మకాలు ఉన్నవాళ్ళు ఎక్కువ. వీళ్ళకి నమ్మకం ముఖ్యం. దానిముందు హేతువాదం నిలవలేదు. అనుభవపూర్వకంగా ఆ సంగతి తెలుసుకున్నాను.

శనివారం పొద్దున్నే తివారి యింటి కెళ్ళాను. అక్కడి నుంచి యిద్దరం ఢిల్లీకి దగ్గర్లో ఉన్న ఓ పల్లెటూరు కెళ్ళాం. అది టిపికల్ యూపీలో ఉండే పల్లెటూరు లాగానే ఉంది. ఊళ్ళోకి వెళ్ళాకా, నాలుగు వీధులు నాలుగు మలుపులు అయ్యాకా, ఓ గుమ్మం ముందర కారు ఆపాడు.

ఇద్దరం యింటి ముందున్న బోర్డుని ఓసారి చదివి లోపలి కెళ్ళాం. లోపల పెద్ద పెరడు. నాలుగువైపులా పోర్షన్లు, మధ్యలో ఓ జామచెట్టు, దానిమ్మచెట్టు, బంతి మొక్కలూ ఉన్నాయి. ఓ బోరు పంపు, మూసేసిన బావి, బట్టలుతుక్కునే బండరాయి, నీళ్ళు నిండిన రెండు తొట్టెలు, తాళ్ళమీద వేళ్ళాడుతున్న బట్టలు. అటు యిటూ తిరుగుతున్న కోళ్ళు, పిల్లలు, రెక్కలాడిస్తున్న పావురాళ్ళు, కట్టేసిన ఓ నల్ల కుక్క.

అన్నీ చూస్తూ రామ్‌నారాయణ్ మహారాజ్ అన్న బోర్డున్న వైపు వెళ్ళాం. అదో పెద్ద గది. కిటకిటలాడుతున్న జనం. కొంతమంది కింద కూచున్నారు. కొంతమంది ఓ వారగా వేసిన ఎర్ర ప్లాస్టిక్ కుర్చీల్లో కూచుని ఉన్నారు. ఓ చివరగా ఓ చిన్న పరుపుంది. ఆ పరుపు మీద ఎవరూ లేరు. పరుపుకి నాలుగు వైపులా ఏవేవో చిన్నా చితకా డబ్బాలు, సీసాలు, పుస్త

## నేటి ఉగాది

సీ॥ ప్రీతిగొలుపు "తీపి" ప్రియమాయె భయమాయె
కమ్మగా నిన్నెట్లు రమ్మనందు?
చింతపండు ధరలు చింతలెక్కించెనెను
"పులుపు" మొహముతోడ పిలువలేను
అపజయాల "వొగరు"లంతకంతకు హెచ్చె
పొగరుగా తలయెత్తి పొగడలేను
కష్టాలె 'చేదు'గా కలకాలమూ నిల్చె
నవ్వుల పువ్వులనే రువ్వలేను

తే.గీ॥ "కారము"గ మారె మా మమకారములిట
"ఉప్పు" తిని మరచెడు వారె యిప్పుడిలను
షడ్రుచుల రూపురేఖలు శల్యమాయె
స్వాగతంబెట్లు పలుకుదు? సర్వధారి!

-కాసర్ల నరేశ్‌రావు

కాలు, సంచీలు. ఓ వైపు గోడకి దేవుడి పటాలు. వాటి ముందు వెలుగుతున్న అగరొత్తులు.

ఏ డాక్టరు కోసం అయినా యింతమంది వెయిట్ చేస్తూంటారో లేదో అనుమానమే.

"చూసావా, ఎంతమందో!" అన్నట్టు సైగ చేశాడు తివారి. జనంలో ఆడవాళ్ళే ఎక్కువ మంది ఉన్నారు. మొగాళ్ళు కొంతమంది మాత్రమే ఉన్నారు. అందరి మొహాల్లోనూ ఏదో బాధ, విషాదం. వాళ్ళని చూడగానే నా నొప్పి గుర్తొచ్చి, నా మొహం కూడా వాళ్ళ మొహాల్లాగే అయింది. ఇద్దరం కుర్చీల్లో కూచున్నాం.

కాస్సేపయ్యాక, రామ రామ హరేరామ అంటూ కాషాయ రంగు లాల్చీ, పంచ వేసుకున్న ఓ తెల్లటి నలభై ఏళ్ళు దాటిన మనిషి వచ్చి, పరుపుమీద కూచుని కళ్ళు మూసుకున్నాడు.

కుడి పైట వేసుకున్న ఓ ఎర్రపూల చీర స్త్రీ, నెత్తిమీద కొంగుని సవరించుకుంటూ ఆయన ముందు కూచుంది.

మహరాజ్ కళ్ళు తెరిచాడు. పూర్తిగా కాదు. అర్ధనిమీలిత నేత్రాలతోనే సైగ చేశాడు చెప్పమన్నట్లుగా.

"మారాజ్! నా కొడుకుకి ఎప్పుడూ ఏదో సుస్తి. నీరసం. ఏ పనీ చెయ్యడు. మీరే ఏదయినా చెయ్యాలి.."

తల ఊపి, "ఎప్పుడు పుట్టాడు? ఏ రోజున, అన్ని వివరాలు యియ్యి."

ఆమెకు ముందే తెలుసేమో, యిలాంటి ప్రశ్న లుంటాయని. ఆయన అడిగీ అడగంగానే తన బట్ట పరుసులోంచి ఓ కాయితం యిచ్చింది.

కనుబొమలు పైకెత్తి, ఓసారి ఆ కాయితాన్ని చూసాడు. వెంటనే కుడివైపుకి, తొంభై డిగ్రీల కోణంలో తిరిగి, ఓ పెద్ద పుస్తకాన్ని, ఎడంవైపుకి తిరిగి, ఓ పలకా బలపాన్ని తీసి ఏవేవో గళ్ళు గీసి, అంకెలు వేసాడు. కళ్ళు పైకెత్తి చాలాసేపు ఆలోచించాడు. కళ్ళు చిన్నగా చేసి ఆమెను చూసాడు.

"దోషం... మంగల్ దోషం... శని ప్రభావం. చాలా ఉంది... అందుకని ఏం చేయాలంటే, జపాలు చేయాలి. ఏం చేయాలి?"

"జపాలు" అని అంది.

"నల్ల నువ్వులు, నల్లబట్ట, నూనె గుడిలో శని దేవతకిచ్చి పూజ చెయ్యాలి. ఏం చెయ్యాలి?"

ప్రశ్న వేసాడు కానీ, ఆమె జవాబు కోసం చూడలేదు.

ఓ రాగి పళ్ళెం తీసాడు, వెనక నుంచి ఓ డబ్బా

## ఉగాది తలఁపులు

రచన: తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి

మావికొమ్మ ననసె, మల్లెతీవియ పూచె
కోకిలమ్మ గొంతు కురిసెఁ దేనె
కవిసెఁ బైరగాలి; యవునుగాని మదాత్మ
పొంగ దీ యుగాది పొలుపు నెంచి.

ఒదిఁగి యొదిఁగి పేదలో తల్లి! పండుగు
ముద్ద యనుచు, గారెముక్క యనుచు
గడప గడప ముందు గగ్గోలు పడుచుండ
నలరఁ జాలఁ నిది మహస్సటంచు.

నలువదేండ్లనాఁడు తెలవాఁడు బోటెక్కె
తాఁకె మిన్నశోక ధర్మచక్ర
మెంగిలాకు నాక నెగఁబడు బడుగులీ
యుర్విఁగలరు నేఁడు నూరనూర.

మిద్దెవాఁడు నాల్గుమేడల వాఁడాయె
గుడిసెవాఁడు పోయె గుట్టనీడ
కేల తెల్లవారి నెదిరించి వెతలోర్చి
పడసె నేలుబడిని భారతమ్మ.

ఒకయెడ విత్తము మూల్గుట
యొకయెడ నొఁకంటిమంట యొలయుట యినే
లకుఁదప్పదయ్యె నేఁడును
సుక మెల్లరకున్ లభించు సూత్రము లేదా?

లేకేమి? కూడు గుడ్డల
కేకారెడి దీనులంద ఱేకతమై ని
ర్భీకతమై నిల్చిన నాఁ
డే కడఁ గన్గొన్న శాంతి యెసఁగున్ పొసఁగున్.

మతము కులము కోవ మఱచి పస్తులతోడ
వగచు తమ్మ లొక్కవర్గ మగుఁడు
కత్తి వలదు మీకు, ఖడ్గమ్ము వలదు
మీ పొత్తు చాలు వెతల నుత్తరింప.

ఆర్థిక సమానతా సిద్ధి యైనఁగాని
విడువ దావేశ మీనాటి విప్లవంబు
సాంఘిక సమానతా కృషి సాగదేని
దేశమున కెన్నఁదగినంత దీప్తిరాదు.

('చక్కట్లు' గ్రంథము నుండి)

-పంపినవారు: తుమ్మల శ్రీనివాసమూర్తి

కథా నిలయం
శ్రీకాకుళం

## ప్రేమించడం నేర్చుకో..

కనులతో కనువిందు చేశావు
నవ్వులతో నాట్యమాడావు
మాటలతో మైమరపించావు
కవ్వించావు - నవ్వించావు
నేను పాట పాడితే పరవశించావు
మళ్ళీ మళ్ళీ పాడమని పరితపించావు
ప్రియా! / ఇన్నివిధాల మైమరపించి
నాలో ఆశలు రేపావు / చివరికి తిరస్కరించావు
మంచితనాన్ని వంచించావు
గెలిచానని విర్రవీగావు / నన్ను నన్నుగా చూడక
అందరిలో నవ్వులపాలయ్యావు
ఇప్పటికైనా ప్రేమించడం నేర్చుకో
నీ ఒంటరి జీవితాన్ని - చిగురింపజేసుకో
అందం శాశ్వతమని భ్రమపడకు
మంచిని పెంచుకో - మమతలు నింపుకో
అప్పుడే నేనెవరో తెలుస్తుంది.
జరిగినదానికి/పశ్చాత్తాపపడుతున్నావని నాకుతెలుసు.

## కవులకు హెచ్చరిక

కవీ! కళారవీ! కార్యశీలీ!
సాగిపో అభ్యుదయపుటంచుల దాకా
విశ్వశాంతి చేకూరునందాక
అంగబలం, అర్థబలం కలవాడికి పట్టంకట్టి
రోదసీవరకెత్తి, జేజేలుకొట్టి బానిసవి గాకు
కాలానికి కళ్ళెం వేసి స్వార్థుడివిగా
చరిత్రహీనుడివి గాకు. / పెద్దోరి ఉక్కుపాదాల క్రింద
నలిగిన మూగజీవుల / హాహాకారాలు విని,
నీ విజ్ఞాన వెల్లువను వెదజల్లు
ప్రియురాలి కౌగిట్లో కోటిస్వరాలున్నవని
అధరామృతాన్ని గ్రోలుతూ అప్రాచ్యుడివిగా
జీవించకు/కలిగినోరి పాదాలకు మడుగులొత్తుతూ
నీ జీవితాన్ని నందనవనం చేసుకుంటావనుకోకు
నవత మాటున దానవ శక్తులు
ప్రళయనృత్యం చేస్తున్నాయ్ - తస్మాత్ జాగ్రత్త
సంఘ సౌధానికి పునాదిరాయివి నీవు
గబ్బిలపు కంపులా అనాదిగా వస్తున్న ఆచారాన్ని
తుదముట్టించి శిథిల ప్రాకారాల చరిత్ర తిరగవెయ్యి
సమానత్వం, సౌభ్రాతృత్వం ధ్యేయంగా
సమసమాజాన్ని నిర్మించు, నవ కవిలా బ్రతుకు.

**-ఉలాపు బాలకేశవులు**

లోని ఎర్ర తాళ్ళని ఆ పళ్ళెంలో వేసాడు. చూపుడు వేలుతో వాటిని రెండుసార్లు అటూ యిటూ అని ఓ ఎర్ర తాడుని తీసాడు. ఆమెవైపు చూసాడు.

"ఇది చాలా మహిమ ఉన్నది. రేప్పొద్దున్న స్నానం చేసాక, దేవుడి ముందర కూచుని, కుడి చేతికి కట్టుకోవాలి. ఓ నెల రోజులు, శనికి మంగల్‌కి జపాలు చేయాలి. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. ఓ నెల తర్వాత రా..."

ఆమె లేచింది. జాకెట్టుకున్న జేబులోంచి ఓ నలిగి పోయిన పది కాయితం తీసి యిచ్చింది. ఆయన పుచ్చుకోలేదు. యింకో పది తీసింది. అక్కడున్న గల్లా పెట్టెలో వెయ్యమన్నట్లు సైగ చేసాడు.

ఆమె వెళ్ళిపోయింది.

ఆ తర్వాత ఓ ఎర్రపూల పంజాబి డ్రెస్‌లో ఉన్న ఓ లావుపాటి ఆమె వచ్చి కూచుంది. ఆమె పక్కన ఓ సన్నటి మనిషి, వదులుగా ఉన్న పైజామా, లక్నో కుర్తాతో కూచున్నాడు.

సద్దుకుని కూచున్నాక, ఆమె ఏడవడం మొద లెట్టింది. "సరిగ్గా కిందటి నెల వచ్చాను. పదకొండు రూపాయలు యిచ్చాను. యింకో పదకొండు రూపాయ లిచ్చి ఓ మంత్రం వేసిన తాడు తీసుకున్నాను. ఆ తాడు మా పితాజీ చేతికి కడ్తే, ఆయన బతుకుతాడని అన్నారు. జపాలు చెయ్యమంటే చేసాం. రామాయణ పాఠ్ చేసా. జొరం తగ్గలేదు. జొరం తగ్గలేదు. సఫదర్ జంగ్ ఆస్పతాల్ తీసుకెళ్ళాం. కానీ బతకలేదు..." అంటూ మళ్ళా ఏడవడం మొదలెట్టింది.

ఆయన కళ్ళు ఓసారి పెద్దగా చేసాడు. తల అడ్డంగా ఊపాడు. "అన్ని జపాలు చేసాక అలా ఎం దుకు జరిగింది? ఆ... మీరు మృత్యుంజయ జపాలు చేసారా?"

"లేదు... ఎలా చేస్తాం? ఈ లోపలే ఆయన పోయాడు కదా!"

అరచేత్తో ముందున్న బల్లమీద కొట్టాడు.

"అదీ సంగతి... అందుకే అలా జరిగింది. ఆ జపం కూడా పూర్తయి ఉంటే మీ పితాజీ బతికేవారు. జపాలు, హోమాలు, పూజలు పూర్తి కాకుండా, ఫలితాలు రమ్మంటే ఎలా వస్తాయి? తప్పు చేసారు ఏం చేసారు?"

"తప్పు..." అంది.

"ఆఁ... చిన్న తప్పు కూడా కాదు. పెద్ద తప్పు. ఆ మృత్యుంజయుడు సంతోషపడి ఉంటే, మీ పితాజీ

మీకు మిగిలేవారు. యిప్పుడు అనుకుని ఏం లాభం?..." అంటూ పెదవి విరిచి, తన తప్పేమీ లేనట్లు, తప్పంతా మీదే అన్నట్లు చూసాడు.

ఇంకో ముసలామె ఓ పదిహేను, పదహారేళ్ళ పిల్లాడిని తీసుకొచ్చి కూచుంది.

"ఈ పిల్లాడు రాత్రిళ్ళు నిద్రపోవడం లేదు. ఏదో భయం అంటాడు. మధ్య మధ్యలో అరుస్తూంటాడు. మీరే ఏదయినా చేయాలి."

"చింత వొద్దు తల్లీ! పిల్లాడి తల దిండు కింద ఓ చాకు పెట్టండి. పడుకునే ముందు హనుమాన్ చాలీసా చదవాలి. ఓ పదిహేను రోజులు అయ్యాక మంచి కలలు వస్తాయి. హన్‌మాన్‌జీ కూడా ఓ రోజున కల్లో వస్తాడు. ఆ తర్వాత ఓ కిలో పేడా పర్‌షాద్ తీసుకురా..."

ఆమె ఓ పది రూపాయలిచ్చింది. ఆయన ఓ తాడు యిచ్చాడు. పదకొండు రూపాయలు డబ్బాలో వేసాకా వెళ్ళిపోయింది, పిల్లాడిని తీసుకుని.

ఈ విధంగా ఓ పదిమంది అయ్యాక నా వంతు వచ్చింది. నేను కుర్చీలోంచి లేవబోతూంటే ఫోన్ మోగింది. నేను కూచున్నాను.

"హల్లో... మై రామ్ నారాయణ్ మహరాజ్... నమష్కార్... నమష్కార్... ఎలా గుర్తొచ్చాను?... చెప్పండి... ఓ... ఓ... హాం జీ... ఠీక్ హై... ఠీక్ హై... సరిగ్గా రేపు ఉదయం ఆరు గంటలకే వచ్చేస్తాను. మీ నౌకర్ని పంపిస్తే ఉద్యాపన కి ఏం కావాలో రాసిస్తాను... బరాబర్... జీ... హఁజీ... హఁజీ... నమష్కార్..." అంటూ ఫోన్ పెట్టేసాడు.

నేను వెళ్ళి కూచుని, నా బాధ చెప్పాను.

నా చొక్కా ఎత్తి కడుపు మీద కొట్టాడు. నాలిక చూసాడు. అరచేతులు చూసాడు. గోళ్ళు చూసాడు. కళ్ళు చూసాడు.

"నేను చెప్పినట్లు చేస్తే ఒక్క నెలలో తగ్గిపోతుంది. రెండు ఏకాదశిలు ఉపవాసం ఉండాలి. ద్వాదశి రోజున పొద్దున్నే భోగ్ ఛడాయించాలి. ఆ తర్వాత గణేష్ పూజ చేయాలి. ఛండీ మాతా జపం చేయాలి... ఆ తర్వాత ఏం చేయాలో చెప్తాను" అంటూ ఓ ఎర్ర తాడిచ్చాడు. దేవుడి ఎదురుగా కూచుని కుడి చేతికి కట్టుకోమన్నాడు.

ఆ తర్వాత అటూ యిటూ ఉన్న డబ్బాల మూతలు తీసి దేనికోసమో వెతుకుతున్నాడు. కావల్సిన డబ్బా దొరికాక, దాన్ని తన ముందున్న డెస్క్ మీద పెట్టి మూత తీసాడు. చూపుడు వేలుతో కెలికి, కెలికి, ఓ పగడం తీసాడు.

"దీన్ని వెండిలో వేయించి, ఉంగరం చేయించండి. దానిని, పూజచేసి కుడిచేతి వేలికి పెట్టుకోండి. మళ్ళా నెల రోజులయ్యాక రండి."

తాడుకి పదకొండు, సలహాలకి మరో పదకొండు, పగడానికి నూటయాభై తీసుకున్నాడు. కాదు.. డబ్బాలో వేయమన్నాడు.

వారం రోజుల క్రితం మధు షిరివాస్త్‌వ్‌కి, కన్సల్టేషన్‌తో సహా మూడువందలిచ్చాను. అందులోనే మందులు కొనాలన్న నియమం ఉంది. కాబట్టి మరో వంద యిచ్చి వాళ్ళ ఫార్మసీలో మందులుకొన్నా ఫలితం కనపళ్ళేదు. వాటితో పోలిస్తే ఈ పండిట్‌జీ చచ్చేంత చీప్.

## ఉగాది స్వాగతం!

**తూ**ర్పున తొలి ఉషస్సు కిరణాలు
వసంతోత్సవ వేళ ఉదయించె...!
కొమ్మ రెమ్మలపై మెరిసె మంచు బిందువులు
పురివిప్పిన మయూరీల నాట్య విన్యాసాలు
చిలకల కిలకిలా రావాల పులకరింతలు...!
ఈ శుభ తరుణంలో అరుదెంచె పౌష్యలక్ష్మి
తెలుగు వారి తొలి ఉగాది పండుగ వేళ...!!
వెలుగు కళల లోగిళ్ళు మన పల్లెటూళ్ళు..
పచ్చని పొలాలు సస్య సంపదకు సంకేతాలు...!
గత స్మృతుల చీకటి వెలుగులు మన తీపి జ్ఞాపకాలు
వర్తమానం మన నిర్ణయాల రంగుల హరివిల్లు..!!
కోటి ఆశలు మన మదిలో మెదిలే వేళ
భిన్నత్వంలో ఏకత్వమే మన లక్ష్యమైన వేళ
మనలో సమైక్యతా భావం మళ్ళీ చిగురిస్తుంది...!!
తరతరాల మన సంప్రదాయాలు సదా అనుసరణీయం
పెద్దల అనుభవాల అధ్యయనం కావాలి మన ధ్యేయం...!
పండుగ వేడుకలకు మన పరిసరాలు వేదికలు
మనలో ఉప్పొంగే ఆనంద తరంగాల జల్లులు
మన అంకిత భావానికి అవి ప్రతిబింబాలు..!!
ఉగాది పచ్చడిలోని అంతరార్థం ఆరోగ్య సూత్రం
అమ్మవారి సన్నిధిలో అర్చకుల ప్రత్యేక పూజలు
వేద పండితులు వివరించే మన రాశి ఫలితాలు
కళాప్రాంగణంలో నృత్య సంగీత కవితా గానాలు
భావితరాల ప్రగతిబాటకు విజయ సోపానాలు..!
'సర్వధారి' నామ సంవత్సరమా! నీకిదే మా స్వాగతం..
సకల సౌభాగ్యాలను సమకూర్చాలి ఈ తొలి చైత్రం..!!

–తంగెళ్ల పాండురంగశర్మ

## తపిస్తున్నాను ఆర్తిగా!

ఆశ ఆగదు కొంచెమైనా.. మనసు నిలవదు క్షణమైనా
గుండె సవ్వడిలో నీ పేరే ప్రతిధ్వనిస్తోంది నాదంలా...!
తనివి తీరదు ఎంత చూసినా... మనసు నిండదు
ఎంత మాటాడినా...
ప్రతి క్షణమూ నీ తోడే కావాలని... జపిస్తూ ఉన్నా
నీ పేరే వేదంలా...!
చూపులో చల్లదనం... అది మంచుపూల వర్షం...
మాటలో తీయదనం.. అది నవవసంతాల హర్షం..
స్పర్శలో ఆత్మీయత... అది మనసు పాడే మౌన
ప్రణయగీతం...!
నీ ఊహలే పల్లవిగా పాడుకుంటున్నాను... ఎల్లలు
లేని గానంలా...!
నీ... చిరు నవ్వుల మల్లెలు ఏరుకోవాలని...
మాటల మధురిమలు ఎద నింపుకోవాలని...
ఊసులూ.. ఊహలూ.. తీయగా పంచుకోవాలని..
ఎగిసి పడుతోంది హృదయం.. తుపానులో కెరటంలా..!
ఎప్పుడు కరుణిస్తావో... ఎన్నడు మురిపిస్తావో...
ఏ తీరుగ స్పందిస్తావో... ఎప్పుడు తోడందిస్తావో
తెలియక రెపరెపలాడుతోంది మనసు... గాలిలో
దీపంలా...!
చిరునవ్వుతో ఆదరించినా... కాదని కన్నీటి జ్వాల రేపినా...
నా... మనసు మందిరంలో నీ చోటు పదిలం!
అందుకే... తపిస్తున్నాను ఆర్తిగా...
మన బంధం నిలవాలని...
ఎప్పటికీ... ఆరని అనురాగ దీపంలా...!

## నగ్న సత్యం

కాలుతున్న కొవ్వొత్తి... కరుగుతుంది క్షణక్షణం
సాగుతున్న బ్రతుకు... చేరువవుతుంది మృత్యువుకు అనుక్షణం
వత్తికాలిపోగానే.. ముగిసిపోతుంది కొవ్వొత్తి జీవితం
శ్వాస ఆగిపోగానే... తీరిపోతుంది మనిషికి బ్రతు కుతో ఋణం!
దశాబ్దాలు... శతాబ్దాలుగా... సాగుతున్న జీవిత చక్రమిది
కఠినమైనదే అయినా... ఎవరూ కాదనలేని నగ్న సత్యమిది!
కానీ... కొవ్వొత్తి కరుగునంతవరకు
వెలుగులు పంచుతుంది చీకటిలో చిరుదివ్వెలాగా...
మరి... మనిషి శ్వాస ఆగునంతలో
చేస్తున్నాడా సత్కార్యమేదైనా తలచి తన బాధ్యతగా?

-కె. సురేందర్‌రావు

ఓ వారం రోజులు గడిచాయి. నొప్పి తగ్గలేదు.

మా బావమరిది అక్కడెక్కడో, హైద్రాబాద్‌లోనే ఓ ఫ్లాట్ తీసుకున్నాడుట. యిల్లు పూర్తికాకుండానే గృహ ప్రవేశం చేసుకుంటున్నారుట. సుప్రియ ఒక్కతే. ఆడపిల్ల కాబట్టి మరీ మరీ రమ్మనమని ఫోన్లో చెప్పాడు. ఏ రాజధానిలోనూ దొరకలేదు. తిరుపతి వెళ్ళే సంపర్క క్రాంతిలో దొరికింది వెళ్ళాం.

గృహప్రవేశం అయిన మర్నాడే కడుపునొప్పి. దగ్గర్లోనే ఉన్న మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో, ఓ గాస్ట్రో ఎంటరాలజిస్ట్‌కి చూపించాము.

ఆయనకి, ఎక్స్-రేలతో సహా అన్నీ వివరంగా చెప్పాను. అల్సర్ అని అన్నాడు. ఎండోస్కోపీ ద్వారా, అధునాతన పద్ధతిలో ఆపరేషన్ అయిపోయింది.

వారం రోజులు విశ్రాంతి తీసుకుని ఢిల్లీ వచ్చాను. రెండు రోజులు సెలవలొచ్చాయి. శని, ఆదివారాలు కాబట్టి– సోమవారం ఆఫీసు కెళ్ళాను.

మధ్యలో సిగరెట్టు తాగడానికి బయటకొచ్చి నప్పుడు తివారి కనిపించాడు.

"షిరికాంత్ జీ! ఎలా ఉన్నారు? నొప్పి ఏంవయినా తగ్గిందా!"

అప్పటికిగాని గుర్తురాలేదు, మహరాజ్ చెప్పిన ఏకాదశి ఉపోషాలు, ద్వాదశి భోగ్ సంగతి. అవేవీ చెయ్యలేదు. కానీ, ఎలా చెప్పాలో తెలీలేదు.

"నొప్పి ఏమీ లేదు, తగ్గిపోయింది"

"చూసావా! మహరాజ్ జీ మహాత్మ్యం. ఇప్పటికైనా నమ్మకం కుదిరిందా!"

"ఉపోషాలు అవీ ఏమీ చెయ్యలేదు..."

"తగ్గిపోయాకా చెయ్యాల్సిన పనిలేదు కదా... యింక చెయ్యక్కర్లేదు... యింకా నెల కాకుండానే తగ్గిపోయింది."

"నువ్వు పూర్తిగా వినటంలేదు. హైద్రాబాద్ వెళ్ళాకా తెలిసింది అల్సర్ అని. అక్కడ ఆపరేషన్ చేసారు..."

"అదే కదా, మహాత్మ్యం అంటే... ఇన్ని రోజులు మనకెందుకు తెలీలేదు, అది అల్సర్ అని! అదీ చమత్కార్. అందుకే మహరాజ్ దగ్గరికి అందరూ వస్తారు. తగ్గిపోతుంది అన్నాడు. అలాగే తగ్గిపోయింది నెల రోజులు లోపల అంటే నెల రోజులు. సరిగ్గా అలాగే జరిగింది. అసలు యింకా ముందే... మహత్యం"

ఇక్కడ తివారి నమ్మకం సైన్సుని ఓ పక్కని పడేసింది. ■